క్లుప్తంగా

రసవత్తరంగా చదరంగం పోటీలు

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాలలో చదరంగం పోటీలు రసవత్తరంగా సాగాయి. గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొని పోటీపడ్డారు. వీరిలో విజేతలకు ఉగాది రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు రంగరాజు, శేషగిరిరావు తెలిపారు. హెచ్‌ఎం రామయ్య, చెస్ కోచ్ సుధీర్ పాల్గొన్నారు.

చెత్త సేకరణకు 21 వేల బుట్టల మంజూరు


ఆటోలో పంచాయతీలకు తరలిస్తున్న చెత్తబుట్టలు

మాకవరపాలెం: గ్రామాల్లో చెత్త సేకరణకు బుట్టలను అందజేస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీవో జాన్‌లింకన్ బుధవారం తెలిపారు. స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా మండలానికి 21,000 చెత్త బుట్టలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని మండలంలోని 31 పంచాయతీల్లో ప్రజలకు పంపిణీ చేసేందుకుగాను మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆటోలపై తరలించామన్నారు. ప్రజలంతా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఈ బుట్టల్లోనే వేస్తే పారిశుధ్య కార్మికులు వచ్చి తీసుకెళ్తారని తెలిపారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు.

వీల్‌చైర్ అందజేత


అప్పారావుకు వీల్‌చైర్ అందించిన వైద్యాధికారి, తదితరులు

మాకవరపాలెం: తామరం గ్రామానికి చెందిన కడారి అప్పారావు మూడేళ్లుగా నడవలేనిస్థితిలో ఇబ్బందులు పడుతున్నాడు. అతడికి ప్రభుత్వం మంజూరు చేసిన వీల్‌చైర్‌ను వైద్యాధికారి సీతారామలక్ష్మి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వీల్‌చైర్లు, చేతి కర్రలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. ఈ మేరకు జి.కోడూరు గ్రామానికి మూడు, తామరం గ్రామానికి ఒకటి చొప్పున వీల్ చైర్లు వచ్చాయన్నారు. మరో 10 చేతి కర్రలు పంపిణీ చేస్తున్నా మన్నారు. తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కె.కోటపాడు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కు ఈవీఎంలో ఎలా వినియోగించుకోవాలో అధికారులు అవగాహ న కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎ.కోడూరు హైస్కూల్‌లో మాక్‌పోలింగ్ నిర్వహించి 255 మంది ఓటు వేయించా రు. ఈవీఎంల వినియోగంతో ఎన్నికల నిర్వహణ పూర్తి పారదర్శకంగా ఉంటుందని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. హెచ్‌ఎం కామేశ్వరరావు, ఎన్నికల అధికారి రాంబాబు, వీఆర్వో అప్పలరాజు, వీఆర్ఏ పాల్గొన్నారు.

70 మంది రోగులకు వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రోలుగుంట: చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో బుధవారం బి.బి.పట్నంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 70 మంది రోగులకు బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యురాలు సునీత పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఐవీ, టీబీ వ్యాధులపై ఈ సందర్భంగా సంస్థ స్కీం కౌన్సిలర్ మలసాల గణేష్ అవగాహన కల్పించారు. సర్పంచ్ గరగా విశ్వేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


రోలుగుంట: వలంటీర్లతో సర్పంచ్ కాంతమ్మ దంపతులు


రావికమతం: తోటకూరపాలెంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ రాజు


గొలుగొండ: జోగుంపేటలో వలంటీర్లకు సన్మానం చేస్తున్న దృశ్యం

వలంటీర్ల సేవలు అభినందనీయం

బుచ్చెయ్యపేట: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి తెలిపారు. పెదపూడి, చింతపాక, పీపీ అగ్రహారం, గున్నెంపూడి, పెదమదీన సచివాలయాల పరిధి వలంటీర్లకు బుధవారం చింతపాకలో సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను అందించి ఘనంగా సత్కరించారు. అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను తొలగిస్తామని ప్రచారం చేస్తున్న తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణ మూర్తి, సర్పంచ్‌లు, నాయకులు గొలజాన శ్రీను, ముచ్చకర్ల అప్పారావు, గోపిశెట్టి శ్రీను, వజ్రపు శ్రీను, నాయుడు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, సెక్రటరీ రామలక్ష్మి పాల్గొన్నారు.

రావికమతం: వలంటీర్ల సేవలు అమోఘమని, ప్రభుత్వానికి కీర్తిని తెస్తున్నాయని ఎంపీపీ పైల రాజు తెలిపారు. తట్టబంద, తోటకూరపాలెం, గుడ్డిప గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సేవా వజ్ర బాబులు నాయుడుతోపాటు ఉత్తమ అవార్డులకు ఎంపికైన 39 మంది వలంటీర్లను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, చోడవరం ఏఎంసీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ వలంటీర్ల నిబద్ధత వల్లే సంక్షేమ పథకాలు ప్రజలకు విజయవంతంగా అందుతున్నాయన్నారు. లంచాలకు తావులేకుండా అందుతున్న విషయాన్ని అన్ని రాష్ట్రాలు గుర్తిస్తున్నాయన్నారు. ఎంపీటీసీ పిల్లా శేషుబాబు, గుడ్డిప సర్పంచ్ గణేశ్వరరావు, ఎక్స్ అఫిషియో సభ్యుడు గాలి రమణబాబు పాల్గొన్నారు.


చీడికాడ: కోనాం వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ జయమ్మ తదితరులు

గొలుగొండ: జోగుంపేట, సాలికమల్లవరం గ్రామ వలంటీర్లకు బుధవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గజ్జలపు మణికుమారి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం నేరుగా ప్రజలకు అందడంలో వలంటీర్ల పాత్ర అమోఘమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్‌లు జువ్వల లక్ష్మి, పెదిరెడ్ల లక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేట: చింతపాకలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ రాంబాబు

రోలుగుంట: సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేయించడం, వాటి మంజూరుతోపాటు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందిస్తున్న వలంటీర్లు సేవలు అభినందనీయమని సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ అన్నారు. బుధవారం కొవ్వూరులో నియోజకవర్గం బెస్ట్ మేనియల్‌గా సాయి లక్ష్మి, సేవా వజ్రగా పుష్పవతి, సేవా రత్నగా భూలక్ష్మికి, మిగిలిన వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసి సర్పంచ్ కాంతమ్మ దంపతులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యర్రంశెట్టి రాజారావు, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

చీడికాడ: కోడి కూయక ముందే ఇంటి తలుపుతట్టి అర్హులకు సంక్షేమ పథకాలందిస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ వలంటీర్లు మన కుటుంబ సభ్యులుగా మారారని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. బుధవారం కోనాం, అప్పలరాజుపురం గ్రామ సచివాలయంలో వలంటీర్లను దుశ్శాలువాలతో సత్కరించి వారి నిస్వార్థ సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, సర్పంచ్‌లు చుక్కా అప్పలనాయుడు, సలుగు ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మలు, ఉప సర్పంచ్ కసిరెడ్డి రామకృష్ణ, నాయకుడు సలుగు అప్పలనాయుడు పాల్గొన్నారు.

జె.నాయుడుపాలెం హైస్కూల్లో సోషల్ క్లబ్ ఏర్పాటు

- సోషల్ టీచర్‌ను అభినందించిన లిప్ బృందం


సోషల్ క్లబ్ నమూనాలు పరిశీలిస్తున్న లిప్ బృందం

రోలుగుంట: జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ వీరభద్రరావు విద్యార్థుల విజ్ఞాన వికాసం కోసం లోకాస్ట్–నోకాస్ట్‌తో కూడిన సోషల్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. పది పరీక్షల్లో మంచి ఫలితాల సాధన కోసం మండల విద్యా శాఖ ఏర్పాటు చేసిన లిప్ బృందం బుధవారం పాఠశాలను సందర్శించింది. ఇక్కడ సోషల్ క్లబ్‌ను లిప్ బృందం ప్రతినిధి, కుసుర్లపూడి హెచ్‌ఎం శెట్టి మోహన్‌రావు ప్రారంభించారు. తర్వాత విద్యార్థుల్లో వికాసానికి గదుల్లో ఏర్పాటు చేసిన పటాలు, గ్లోబు, చార్టులు, దేశ పోరాట యోధులు, పూర్వ రాజుల చిత్రపటాలు, దేశాల మేప్, చిత్రపటాల నమూనాలను పరిశీలించారు. టీచర్ వీరభద్రరావును హెచ్‌ఎం రమేష్ కుమార్‌ను అభినందించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ఈ బృందంలో అప్పన రాంబాబు, సతీష్ తదితరులున్నారు.

జంపెన రామాలయంలో ఏకాహం

మాడుగుల: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా జంపెన రామాలయంలో నిర్విరామంగా ఏకాహం జరిగింది. మంగళవారం ఉదయం 6 నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు నిర్విరామంగా సాగిన ఈ భజన కార్యక్రమంలో హరేరామ, హరేకృష్ణ, కృష్ణ, కృష్ణ హరే హరే నామ స్మరణతో ఈ ప్రాంతం మార్మోగింది. భజన బృందం సభ్యుడు వానపల్లి ధర్మారావు, సర్పంచ్ నేమాల గురువులునాయుడు, గ్రామస్తులు పెచ్చేటి కొండలరావు, వానపల్లి ధర్మారం, పాతాళం చిన్నతల్లి, మరిశా లక్ష్మి, సిరిసోళ్ల దేముడమ్మ, మానస సంస్థ కార్యదర్శి పరమేశ్వరావు పాల్గొన్నారు.

ఉచితంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు


పి.కె.గూడెంలో రిజిస్ట్రేషన్ల వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

నాతవరం: సచివాలయాల్లో ఉచితంగా చేసే ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ తెలిపారు. మండలంలో చమ్మచింత, గునుపూడి, పి.కె.గూడెం, పెదగొలుగొండపేట సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ల తీరును సిబ్బందిని లబ్ధిదారులను వేర్వేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో 2,290 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వారందరికీ దశలు వారీగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో రెవెన్యూ సిబ్బంది గానీ సచివాలయ సిబ్బంది గానీ ఇబ్బందులు పెడితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వీటితోపాటు జగనన్న భూ రీసర్వే మూడు రెవెన్యూ గ్రామాల్లో చేస్తున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుక బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించినృత్య ప్రదర్శనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. స్థానిక హెచ్‌ఎం, ఎంఈవో–1 బి.పడాల్‌దాస్ చిన్నారులతో కలిసి నృత్య ప్రదర్శన చేసి ఉత్తేజ పరిచారు. అంతకు ముందు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నందున సమయం వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. భయాన్ని వీడి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు.


చిన్నారులతో కలిసి నృత్యం చేస్తున్న ఎంఈవో–1 పడాల్‌దాస్

కార్యక్రమంలో ఎంఈవో–2 వి.ఉషారాణి, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కె.వి.రమణ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండల అధ్యక్షుడు కొరుపోలు శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుషారుగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు

చోడవరం: గోవాడలో బుధవారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పందేలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 23 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. వీటిలో ఎం. కొత్తపల్లికి చెందిన నంబారు రామకృష్ణ ఎడ్లు విజేతగా నిలిచాయి. నర్సయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ ఎడ్లు ద్వితీయ, ఎం.కొత్తపల్లికి చెందిన మురికితి లోవరాజు ఎడ్లు తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. దేవరాపల్లికి చెందిన వారాది భరద్వాజ్ ఎడ్లు నాలుగు, గోవాడకు చెందిన వెలుగుల తాత ఎడ్లు ఐదు, నర్సయ్యపేటకు చెందిన బూతా తేజస్విని ఎడ్లు ఆరు, చుక్కపల్లికి చెందిన ఎం. హరికృష్ణ ఎడ్లు ఏడు, నర్సయ్యపేటకు చెందిన ముమ్మిన రామకృష్ణ ఎడ్లు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. వీటికి ప్రోత్సాహక బహుమతులు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రదానం చేశారు.


జిల్లా స్థాయి పోటీల్లో పరుగు తీస్తున్న ఎద్దులు

అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి మల్లునాయుడు


మాట్లాడుతున్న ఫైర్ అధికారి రాజేశ్వరావు

బుచ్చెయ్యపేట: అగ్ని ప్రమాదాల పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చోడవరం అగ్నిమాపక అధికారి మల్లునాయుడు తెలిపారు. బుధవారం వడ్డాది అక్షర పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. వేసవి సందర్భంగా పాఠశాల దగ్గరలో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో అత్యవసర సమయంలో బయటకు పోయేలా మార్గం ఏర్పాటు చేసుకోవాలన్నారు. మంటలార్పేలా దగ్గరలో ఇసుక, నీళ్లు, ఇతర సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అగ్నికి మండే పదార్థాల ను డీజిల్, పెట్రోల్, గ్యాస్ ఇతర వస్తువులను పాఠశాలకు దూరంగా ఉంచాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది శేఖర్ దినేష్, శంకర్, సత్తిబాబు పాల్గొన్నారు.

పొంగలిపాకలో

మాడుగుల: వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మాడుగుల అగ్నిమాపక దళాధికారి వి. రాజేశ్వరావు తెలిపారు. అగ్ని ప్రమాదాలు నివారణ గురించి బుధవారం పొంగలిపాక పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్.ఎఫ్ బోగేశ్వరావు, సిబ్బంది నానాజీ, వరహాలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన


కరపత్రం విడుదల చేస్తున్న కళాజాత బృందం

రోలుగుంట: కొండపాలెంలో హెచ్‌ఐవీపై కళాజాతా బృందం బుధవారం ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా హెచ్‌ఐవి సోకిన తల్లి నుంచి బిడ్డకు సంక్రమణ, సంరక్షణపై కళారూపంలో ప్రదర్శించింది. దీనికి సంబంధించిన 2017 చట్టం, ఏఆర్టీ కేంద్రాల ఏర్పాటు, మందు లు పంపిణీ, వినియోగం, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించింది. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం విడుదల చేసింది.

డ్రైనేజీలు పరిశుభ్రం చేయండి


చెర్లోపాలెం సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: డ్రైనేజీలు ఎప్పటికప్పుడూ పరిశుభ్రం చేయాలని, తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో జాగారపు రాంబాబు తెలిపారు. ఆయన బుధవారం చెర్లోపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. సచివాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా బాధ్యతగా ఉండాలన్నారు. పంచాయతీలో ప్రధాన సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నర్సీపట్నం: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్(తురకబడి)లో పదో తరగతి విద్యార్థులకు బట్టల వ్యాపారి రాము స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. 126 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తోపాటు పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు హెచ్‌ఎం కె.వి.రమణకు అందజేశారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ దాతలు ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వ్యాపారి రాముకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎదుగుదలకు క్రమశిక్షణే ఆయుధం

నర్సీపట్నం డీఎస్పీ వెంకటరామయ్య


వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

నర్సీపట్నం: క్రమశిక్షణతోనే విద్యలో రాణించగలరని నర్సీపట్నం డీఎస్పీ బి.వెంకటరామయ్య విద్యార్థులకు సూచించారు. చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నత ఆశయాలు చేరుకోవడానికి క్రమశిక్షణ అంశంపై పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉన్నత ఆశయాలను చేరుకోవడానికి క్రమశిక్షణ నిజమైన ఆయుధమన్నారు. క్రమశిక్షణతో ఎన్ని అవరోధాలు ఎదురైనా అధిగమించవచ్చన్నారు. సచిన్ టెండూల్కర్ క్రీడాకారుడిగా తయారవ్వడాని కి క్రమశిక్షణే దోహదపడిందన్నారు. కష్టపడి చదివి పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడ ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శ నను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థు ల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. అనంతరం డీఎస్పీని హెచ్‌ఎం వి.రామకృష్ణ, పాఠశాల చైర్మన్ సముద్రాలు, ఉపాధ్యాయులు రాజ్‌గోపాల్ ఘనంగా సత్కరించారు. చివరిగా పాఠశాల ఆవరణలో డీఎస్పీ మొక్కలు నాటారు.

విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

కె.కోటపాడు: విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. కె.కోటపాడులో వైద్య, విద్య, ఐసీడీఎస్ సిబ్బందితో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతీ మూణ్నెల్లకు ఒకసారి హెచ్‌బీ పరీక్షలు చేయాలన్నారు. రక్తహీనత ఉంటే మధ్యాహ్నం భోజనం తర్వాత తప్పనిసరిగా ఐరన్ మాత్రలను వేయించాలన్నారు. ఆ తర్వాత మరో మారు హెచ్‌బీ పరీక్ష, హిమోగ్లోబిన్ శాతం నమోదు చేయాలన్నారు. మూడు శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విద్యార్థులు ఎనీమియా బారినపడకుండా చూడాలని తెలిపారు. రక్తహీనత లేని విద్యార్థులు ఆరోగ్యంగా చదువుల్లో చురుగ్గా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నిర్మల, సాయికృష్ణ, ఎంఈవోలు డీవీడీ ప్రసాద్, సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత భవిత

పూర్వపు వీసీ ముర్రు ముత్యాలనాయుడు


విద్యార్థిని అభినందిస్తున్న పూర్వపు వీసీ ముత్యాలనాయుడు

కె.కోటపాడు: విద్యార్థి దశ ఎంతో కీలకమని పూర్వపు వీసీ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక అయ్యన్న విద్యా సంస్థల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగులెస్స అని మహానుభావులు కొనియాడిన సంగతిని తెలుగు భాషాభిమానులు మరువరాదన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించడంతో ఉన్నత అవకాశాలను త్వరితగతిన పొందవచ్చన్నారు. తెలుగు పద్యాలను ఆలపించిన చిన్నారికి జ్ఞాపిక అందించి సన్మానించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా రాచపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి, ఉపాధ్యాయులు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ఏటా ఫిబ్రవరి 21న మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు విద్యార్థులకు వివరించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులందిస్తున్న దృశ్యం

రావికమతం: కిత్తంపేట పాఠశాలలో మాతృభాషా దినోత్సవం బుధవారం నిర్వహించారు. సీఆర్పీ రామారావు, ఉపాధ్యాయులు ముందుగా తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం


అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్ రాణి, తదితరులు

మాకవరపాలెం: బ్యాంకు సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తామరం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ రాణి తెలిపారు. బుధవారం తామరంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రంలో ఏటీఎం వాడకం, పొదుపు, డిపాజిట్లు, యాప్‌లు, బ్యాంకులు అందించే పథకాలపై కౌన్సిలర్లు ప్రజలకు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మణికుమార్, అనిల్‌కుమార్, వరలక్ష్మి పాల్గొన్నారు.